క్లుప్తంగా

ఘనంగా సింహవల్లీ తాయారు తిరువీధి



తిరువీధిలో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో కొలువుదీరిన సింహవల్లీ తాయారుకు శుక్రవారం తిరువీధి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆలయ బేడా మండపంలో తిరువీధి వైభవంగా జరిపారు. విశేష హారతులిచ్చారు. అర్చకుడు అప్పాజీ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకం



వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం జరిపారు. విశేష పూజలు ముగిశాక భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

భవిత కేంద్రంలో డౌన్ సింట్రోమ్ డే



భవిత కేంద్రం విద్యార్థితో ఎంఈవో దివాకరరావు, సిబ్బంది

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో వరల్డ్ డౌన్ సింట్రోమ్ డే సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి దివాకరరావు పాల్గొని డౌన్ సింట్రోమ్ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. భవిత కేంద్రానికి కోరమండల్ టీయుఎస్ఆర్ సమకూర్చిన స్మార్ట్ టీవీని ప్రారంభించారు. 30 స్కూల్ బ్యాగులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం నాగేశ్వరరావు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు 'ఆదర్శ్'లో మెగా జాబ్ మేళా

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మేళాలో మొత్తం 14 కంపెనీల్లో కొలువులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ(ఆఖరు సంవత్సరం విద్యార్థులూ అర్హులే), ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 91549 38472 నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

ఆ షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలి




స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పాండేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్‌కు యాజమాన్యం ఇచ్చిన షోకాజ్ నోటీసు ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు శుక్రవారం ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండేను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. కార్మిక సమస్యలపై పోరాడుతున్న అయోధ్యరామ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉద్యోగులకు పెండింగ్ ఉన్న 205 శాతం జీతాలను ఈనెల 31లోగా చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును తక్షణమే ఆపాలన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్. రావు, యు. రామస్వామి, రమణమూర్తి, కొవిరి అవతారం, జి. గణపతి రెడ్డి, డి.వి. రమణారెడ్డి, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వేట సాగక.. పూట గడవక



వేట సాగక తీరంలో నిలిపిన తెప్పలు



చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు కష్టాలు చుట్టుముడుతున్నాయి. సముద్రంలో ఆశించినంతగా చేపల వేట సాగక అర్ధాకలితో అలమటిస్తున్నారు. చేయూతనివ్వాల్సిన ప్రభుత్వం కూడా చేతులెత్తేస్తోంది. వేట నిషేధ సమయం ముంచుకొచ్చేస్తోంది. గత ఏడాది ఇవ్వాల్సిన మత్స్యకార భరోసాకే అతీగతీ లేదు. కనీసం ఈ ఏడాదైనా ఆదుకోవాలని పరవాడ మండలంలోని తీరప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు అర్థిస్తున్నారు.

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట గ్రామాలకు చెందిన 972 మంది మత్స్యకారులు, 138 బోట్లలో చేపల వేటకు వెళుతూ జీవనం సాగిస్తున్నారు. విసిరిన వలకు ఇబ్బడిముబ్బడిగా చేపలు చిక్కితేనే వీరికి పూట గడిచేది. లేనిపక్షంలో పస్తులుండక తప్పని స్థితి. పరిశ్రమల నుంచి సముద్రంలో కలుస్తున్న రసాయన వ్యర్థాలతో మత్స్య సంపదకు తీరని నష్టం వాటిల్లుతోందంటున్నారు. దీంతో తమ బతుకులు కూడా అగమ్యగోచరంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్య సంపద మృత్యువాత

ఈ మధ్యకాలంలో తరచూ తీరంలో చేపలు, తాబేళ్ల కళేబరాలు కనిపిస్తున్నాయి. ఫార్మా పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాలే కారణమని మత్స్యకారులు **ఆరోపిస్తున్నారు. సముద్రంలో చాలా లోపలికి వెళ్లినా డీజిల్ ఖర్చులు** తప్ప, ఆశించినంతగా చేపలు వలకు చిక్కట్లేదని చెప్తున్నారు. సముద్రంలో చేపల వేట సాగని రోజుల్లో ఉప్పుటేరులో లభ్యమయ్యే చిరు చేపల వేటపై ఆధారపడేవారు. అయితే ఎన్టీపీసీ నుంచి విడుదలవుతున్న ఫ్లైయాష్ ఉప్పుటేరులో కలవడంతో చిరు చేపల సంతతికీ తీవ్ర నష్టం వాటిల్లుతున్నట్లు చెప్తున్నారు. దీంతో రెంటికీ చెడ్డ రేవడిగా తమ బతుకులు మారాయని గంగపుత్రులు వాపోతున్నారు.



పాడైన వలల్ని అల్లుకుంటున్న గంగపుత్రులు

భరోసానివ్వని 'కూటమి'

చేపల వేట నిషేధ సమయంలో గంగపుత్రులకు గతేడాది మంజూరు చేయాల్సిన మత్స్యకార భరోసా ఇప్పటికీ చెల్లించలేదు. వచ్చే నెల 15 నుంచి వేట నిషేధం అమల్లోకి రానుంది. దీంతో మరో45 రోజులు కుటుంబాలను పోషించుకోవడానికి అప్పులు చేయకతప్పదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. చేపల వేట సాగకపోవడం, వేటకెళ్లినా దొరికే అరకొర చేపలు అమ్మగా వచ్చిన దాంతో కుటుంబాలను నెట్టుకురావడం కష్టంగా ఉందని చెప్తున్నారు. ఇలాంటి సమయంలోనైనా ప్రభుత్వం తమ దుస్థితిని తెలుసుకుని ఎరిగి, మత్స్యకార భరోసా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

కూలి పనులకు వలస

పూట గడవడమే కష్టంగా మారడంతో కూలి పనుల కోసం చాలా మంది మత్స్యకారులు వలసపోతున్నారు. పలాస, నర్సీపట్నం, అనకాపల్లి, చోడవరం, పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లోని జీడి తోటల్లో పిక్కలు సేకరించే పనులకు వెళ్తున్నారు. ఏడాదిలో రెండుమూడు మాసాలు కూలి పనుల వల్ల వచ్చే సొమ్ముతోనే బతుకులు నెట్టుకొస్తున్నారు. సముద్రంలో వలలకు చేపలు చిక్కకపోవడంతో ఊరూరా తిరిగి చేపల అమ్మకాలు సాగించే మహిళలు కూడా ఖాళీగా ఉండాల్సిన దుస్థితి. దీంతో వీరంతా ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఉప్పు గల్లీల ప్రాంతాల్లో రోజుకూలీలుగా వెళ్తున్నారు. వేళ్లకు చన్నీళ్ల తోడుగా కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు.

"కాలుష్యంతో చేపలు మరణిస్తున్నాయి



ఫార్మా పరిశ్రమల వ్యర్థ రసాయనాలు సముద్రంలో కలవడంతో చేపలు నశించిపోతున్నాయి. వేటకు వెళ్లిన వలలకు చేపలు చిక్కక ఖాళీ తెప్పలతో తిరిగి వస్తున్నాం. కాస్తో కూస్తో దొరికిన చేపలు అమ్మితే డీజిల్ ఖర్చులకూ రావట్లేదు. చేపల వేట సాగక కుటుంబ పోషణ కష్టంగా ఉంది. పనుల్లేక పాడైన వలలను మరమ్మతు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నాం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– సూరాడ దేముడు, మత్స్యకారుడు, దిబ్బపాలెం

"మత్స్యకార భరోసా ఊసేలేదు



గత ఏడాది వేట నిషేధ సమయంలో ప్రభుత్వం నుంచి అందాల్సిన మత్స్యకార భరోసా ఇప్పటికీ అందలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలోనే మా ఖాతాల్లో నగదు జమ చేసేది. కూటమి ప్రభుత్వం వస్తే రూ.20 వేలు మత్స్యకార భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. 10 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఆ ఊసెత్తడం లేదు. పూట గడవక కూలి పనులకు వలస వెళ్లక తప్పడం లేదు.

– అరిజిల్లి అప్పలరాజు, మత్స్యకారుడు, ముత్యాలమ్మపాలెం

"పూట గడవడం కష్టంగా ఉంది



రోజువారీ తీరంలో మత్స్యకారుల వద్ద చేపలు కొనుగోలు చేసి పల్లెల్లో తిరుగుతూ చేపల అమ్మకాలు సాగించగా వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. రూ.వెయ్యి పెట్టుబడి పెట్టి, వాటిని అమ్మగా వచ్చిన లాభంతో ఇల్లు గడిచిపోయేది. నెల రోజుల నుంచి చేపలు దొరక్క పల్లెలకు వెళ్లడం మానేసి ఇంటికి పరిమితమయ్యాను. దీంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది.

– మైలపల్లి అమ్మోరమ్మ, చేపల అమ్మకందారు, ముత్యాలమ్మపాలెం



వేట సాగక ఉప్పుటేరు వద్ద ఒడ్డున నిలిపిన తెప్పలు

కాంట్రాక్ట్ కార్మికులపై వేధింపులు సరికాదు

ఎన్టీపీసీ వద్ద సిటు ఆధ్వర్యంలో కార్మికుల ఆందోళన



ఎన్టీపీసీ వద్ద ఆందోళన చేస్తున్న సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో వైద్య పరీక్షల నెపంతో కాంట్రాక్టు కార్మికులపై వేధింపులు ఆపాలని సిటుఎన్టీపీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్టీపీసీ ఎదుట శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం గనిశెట్టి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు బీపీ, సుగర్ ఉందని డ్యూటీకి వెళ్లడానికి వీల్లేదంటూ నిలుపుదల చేయడం, ఆరోగ్యం సక్రమంగా ఉన్నప్పటికీ సీఎంవో కార్యాలయంలో రూ.1,500 వసూలు చేయడం, లేకుంటే వైద్యుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు పని దినాలను కోల్పోవడమే కాకుండా, ఆర్థికపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, కార్మిక చట్టాలను అమలు చేయకపోవడం విచారకరమన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.పి.నాయుడు, గోవిందరాజు, డి.రామారావు, ఎస్.రామారావు, ఎం.సత్యనారాయణ, ఎం.చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు పూర్తి



ఆర్వో ప్లాంట్ తాళాలను అందిస్తున్న ఫార్మాజెల్ పరిశ్రమ ప్రతినిధి అప్పారావు

పరవాడ: మండలంలోని ఇ.బోనంగి దరి ఫార్మాసిటీ కాలనీలో ఆర్వో ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫార్మాజెల్ పరిశ్రమ యాజమాన్య ప్రతినిధి సూర్యదేవర అప్పారావు కోరారు. ఫార్మాజెల్ పరిశ్రమ ఆర్థిక సాయంతో తొమ్మిదేళ్ల క్రితం గ్రామంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు ఇటీవల మరమ్మతులకు గురైంది. ప్రజల తాగునీటి ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని, ప్లాంటుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామ సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. స్పందించిన యాజమాన్యం రూ.2.50 లక్షలు వెచ్చించి, మరమ్మతులు పూర్తి చేసింది. దీంతో ప్లాంటు తాళాలను యాజమాన్య ప్రతినిధి అప్పారావు ప్లాంటు నిర్వాహకులకు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఫార్మాజెల్ హెచ్ఆర్ ఇన్‌వార్డ్ రవి, ఎంపీడీవో వి.ధర్మారావు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, నాయకులు బుగిడి రామగోవిందరావు, మాజీ సర్పంచ్ అట్టా సన్యాసప్పారావు, చందక గోవిందరాజు, కృష్ణ, అట్టా నూకరాజు, గడపాల శ్రీను, సతీష్, కె.కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌కు అంబులెన్స్ వితరణ



శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణన్‌కు అంబులెన్స్ కీ అందిస్తున్న గెయిల్ సీజీఎం ఎల్ఎస్ రావు

సింహాచలం: 98వ వార్డు పరిధి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్) రూ.27.50 లక్షలు విలువ చేసే అధునాతన అంబులెన్స్‌ను అందించింది. గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఎల్.ఎస్. రావు, జీఎం ఎంవీఎస్ మూర్తి అంబులెన్స్‌ను శంకర్ ఫౌండేషన్ జీఎం రాధాకృష్ణన్‌కు శుక్రవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్ రావు మాట్లాడుతూ సమాజానికి, పేదలకు శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. శంకర్ ఫౌండేషన్ ట్రస్టీ ఎ.కృష్ణకుమార్, జీఎం రాధాకృష్ణన్‌లు మాట్లాడుతూ గెయిల్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డీజీఎంలు వి.రమేష్‌కుమార్, బంగారురాజు, గెయిల్ డీజీఎం స్టీఫెన్ పట్నా, చీఫ్ మేనేజర్ మదన్ కులాడే, ఫైనాన్స్ మేనేజర్ ఎ.కిరణ్, సీఎస్ఆర్ సభ్యులు పాల్గొన్నారు.

27న సబ్బవరం వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

సబ్బవరం: మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ-2 ఎన్నిక ప్రక్రియను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. వైస్ ఎంపీపీ-2 చొక్కాకుల గోవింద్ గతేడాది ఫిబ్రవరి 20న తన పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ ఎన్నికల్లో చేతులు ఎత్తే విధానంలో సభ్యులు వైస్ ఎంపీపీ-2ను ఎన్నుకుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం 19 మంది ప్రాదేశిక సభ్యులున్న మండల పరిషత్ పాలకవర్గంలో మెజార్టీ సభ్యులు ఆమోదించిన వ్యక్తి ఎన్నికవుతారని తెలిపారు. ఎన్నికల పరిశీలకులుగా మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.రమామణి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి చెరో రూ.10 వేలు చొప్పున న్యాయస్థానం రూ.70 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, జడ్జి పై విధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

పెందుర్తి: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తి కూడలి వద్ద శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభంకానున్న శిబిరంలో దాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. కార్యక్రమంలో అవయవదానం రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పీ-4 సర్వే ఆమోదానికి గ్రామ సభలు నేడు

సబ్బవరం: మండలంలో పి-4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్) సర్వే పూర్తికావడంతో, సర్వే ఆమోదానికి అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన శనివారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడారు. మండలంలోని 18,004 కుటుంబాలకు సర్వే నిర్వహించాల్సి ఉండగా 18,001 కుటుంబాల సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన మూడు కుటుంబాలకు సాంకేతిక సమస్యతో సర్వే పూర్తికాలేదన్నారు. ఈ గ్రామ సభలకు మండల స్థాయి అధికారులు నోడల్ అఫీసర్లుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సర్వే వివరాలను గ్రామ సభ ముందు ఉంచి, వాటిని ఆమోదించాల్సి ఉంటుందన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

పెదగంట్యాడ: మానవాళి ప్రశాంత మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయని చేపలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్ కుమార్ అన్నారు. వరల్డ్ ప్లాంటేషన్ డే, వరల్డ్ ఫారెస్ట్ డేలను పురస్కరించుకొని పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటితే సరిపోదని వాటిని సంరక్షించాలన్నారు. మొక్కల వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మున్నీషా, పావని, సోమేశ్వరి, పూజిత, ధనలక్ష్మి, దేవి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే అనుబంధ కమిటీల్లో చోటు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్

పరవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్టీ అనుబంధకమిటీల నియామకం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ కోసం కీలకంగా పనిచేస్తున్న వ్యక్తులను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా అనుబంధ కమిటీల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నియామకాలు పూర్తయిన వెంటనే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనుబంధ విభాగాల కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ఆయా కమిటీల అధ్యక్షులు చొరవ తీసుకోవాలని సూచించారు. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందని భరోసానిచ్చారు. పదవులు పొందిన నాయకులు కార్యకర్తలతో మమేకమవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే పని చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీ కార్యచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని, దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు.

సమావేశంలో పార్టీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు వెన్నల సన్యాసిరావు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు చరణ్‌రాజ్, యువజన విభాగం అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్, సర్పంచ్‌లు వి.అప్పారావు, బి.కనకారావు, పి.అప్పారావు నాగమణి, గొర్లి గోపి అమ్మలు, కె.వరలక్ష్మి సీతారామయ్య, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకునాయుడు, నాయకులు బొద్దపు చిన్నారావు, జూనియర్ అప్పలనాయుడు, సుందరపు అప్పారావు, సుందరపు శ్రీను, భాస్కర్, సత్తిలు, ఎ.నారాయణరావు, కిరణ్, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర



మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శి చాందమాల్ అగర్వాల్

మహారాణిపేట: లోక కల్యాణార్థం ఆది మహాలక్ష్మి ఆశీర్వాద యాత్ర నిర్వహిస్తున్నట్లు అఖిల భారతీయ అగర్వాల్ సమ్మేళన్ జాతీయ కార్యదర్శి, యాత్ర దక్షిణ భారత సమన్వయకర్త చాందమాల్ అగర్వాల్ తెలిపారు. నగరంలోని రాజస్థాన్ సాంస్కృతిక మండల్ భవనంలో శుక్రవారం యాత్ర వివరాలను వెల్లడించారు. విశాఖ నగరం నుంచి శనివారం ఈ యాత్ర మొదలవుతుందని, ఏప్రిల్ 4 వరకు మొదటి దశలో 12 రోజులు, ఏప్రిల్ 21 నుంచి 26 వరకు ఆరు రోజులు.. మొత్తం 18 రోజులపాటు రాష్ట్రంలో జన్ ఆశీర్వాద్ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో విశాఖలో, 25 నుంచి 28 వరకు విజయనగరం, శ్రీకాకుళంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తర్వాత కాకినాడ, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, కర్నూలు, శ్రీశైలం, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, రేణిగుంట మీదుగా చెన్నై చేరుకుంటుందన్నారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, గోవా, అండమాన్ నికోబార్ దీవుల్లో మొత్తం 90 రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. మొట్టమొదటి ఆది మహాలక్ష్మి, అష్టలక్ష్మి ఆలయాన్ని హర్యానాలోని అగ్రోహాలో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఆలయ విశిష్టతను ఈ యాత్రలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. సమ్మేళన్ ప్రతినిధులు సమాన్ ప్రకాష్ సరావాగి, వినీత్ లోహియా, దీపక్ కన్సారియా, సంజయ్ సుమన్, టిక్‌మనీ, బీజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ఐఎఫ్ఎస్ అధికారి



ఖజురియాకు అప్పన్న చిత్రపటం అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.పి.ఖజురియా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, జ్ఞాపికలను ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ అందించారు.